క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా ప్రదీప్‌నాయుడు


ప్రదీప్‌నాయుడు

భోగాపురం: వైఎస్సార్ సీపీ నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడిగా బద్దుకొండ ప్రదీప్ నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ శ్రేణుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, 2029లో పార్టీ అధికారమే లక్ష్యంగా అడుగులు వేస్తానని ప్రదీప్‌నాయుడు అన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

విజయనగరం క్రైమ్: బాణసంచా విక్రయదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. నగరంలోని నీళ్లట్యాంకు, కొత్తపేట, దాసన్నపేట, కోట, రింగ్‌రోడ్డు, కాళీమాతా టెంపుల్, ఎఫ్‌సీఐ గొడౌన్, శిల్పారామం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దీపావళి మందుగుండు సామగ్రి విక్రయదారులతో స్టేషన్‌లో ఆదివారం సమావేశమై పలు సూచనలు చేశారు. క్రాకర్స్ విక్రయ ప్రదేశాల్లో టపాసుల రేట్లు తెలిపేలా బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, విక్రయ ప్రదేశంలో అగ్నిప్రమాదాల నివారణకు ఇసుక, నీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎవరైనా నిబంధనలు బేఖాతరు చేస్తే చర్యలు తప్పవన్నారు.

57వ సారి రక్తదానం


రక్తదానం చేస్తున్న సుభాష్

విజయనగరంఫోర్ట్: నగరానికి చెందిన భవిరెడ్డి సుభాష్..57వ సారి రక్తదానం చేసి తనలోని మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తం నిల్వలు తక్కువగా ఉన్నాయన్న విషయం తెలుసుకున్న ఆయన తనవంతు సాయంగా ఓ యూనిట్ రక్తం దానం చేసి సాయం చేశారు. ప్రాణాపాయ స్థితిలో రక్తం అవసరమైన వారికి మనమిచ్చే రక్తం అందితే వారి ప్రాణాలు నిలబడతాయని, ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకురావాలని ఆయన కోరారు. సుభాష్ ఏడాదికి నాలుగు సార్లు రక్తం దానం చేస్తూ ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తుండడం అభినందనీయమని గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి గోవింద్ అన్నారు.

కేసులు పెట్టడం సరికాదు..

దత్తిరాజేరు: సమాజంలో జరుగుతున్న సంఘటనలు తెలుసుకుని వాస్తవాలు రాయడమే పాత్రికేయుల విధి అని.. అటువంటి వారిపై కేసులు పెట్టి వేధించడం సరికాదని ఎంపీపీ గేదెల సింహాద్రప్పలనాయుడు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పోలీసుల సహాయంతో సాక్షిపై వేధింపులకు పాల్పడడం సరికాదన్నారు. ప్రచురితమైన కథనాల్లో వాస్తవాలు గ్రహించి సరిదిద్దుకోవాలే తప్ప మీడియాపై ఎదురుదాడి దిగడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తన తీరు మార్చుకోవాలని కోరారు.

నిర్లక్ష్యం తగదు

వేపాడ: జిందాల్ కంపెనీకి భూములిచ్చిన ఎస్.కోట మండలం మూలబొడ్డవరకు చెందిన గిరిజనుల పట్ల నిర్లక్ష్యం తగదని ఏపీ రైతుసంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తమ బతుకులు బాగుపడతాయనే ఉద్దేశంతో రైతులు కంపెనీకి భూములిస్తే.. 18 సంవత్సరాలైనా కంపెనీ ఏర్పాటు చేయలేదన్నారు. పైగా ఆ భూముల్లో వెంచర్లు వేసి విక్రయించడానికి సిద్ధపడుతున్నారని ఆరోపించారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని ఏళ్ల తరబడి కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదన్నారు. బాధితులకు న్యాయం జరగకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

క్రీడలతో మానసికోల్లాసం

శృంగవరపుకోట: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. పట్టణంలోని పీఆర్ షటిల్ కోర్టులో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ బ్యాడ్మింటన్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలు విద్యకు అవరోధం కాదన్నారు. పోటీల నిర్వహణకు సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయులు, హెచ్ఎంలకు నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీరాములు ధన్యవాదాలు తెలిపారు.

అధికం..అనర్థమే!

- పంటల సాగులో అధికంగా ఎరువులు వాడితే నష్టమే
- భూసారం కోల్పోయి, పంట దిగుబడులు తగ్గే అవకాశం
- అవసరమైనప్పుడు సరిపడ మందు మాత్రమే వేయాలి



భోగాపురం: పంటల సాగులో రైతులు అధికంగా రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. వీటితో అనర్థమే తప్ప ప్రయోజనమేమీ ఉండదని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పంటలకు సోకే తెగుళ్లు, చీడపీడల నివారణకు ఇష్టానుసారంగా పురుగుమందులు వాడితే పైరుకు మేలు చేసే మిత్రపురుగులు చనిపోతాయని తద్వారా నష్టమే ఎక్కువని చెబుతున్నారు. కొంతమంది మార్కెట్‌లోని నకిలీ పురుగుమందు కొనుగోలు చేసి పంటకు వేసి నష్టపోతున్నారని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

కంపెనీ మందులే వాడాలి..

కొన్ని పంటలకు సోకే కొన్ని రకాల తెగుళ్లను నివారించేందుకు గుర్తింపు పొందిన కంపెనీల మందులనే వాడాలని వ్యవసాయాధికారులు సలహా ఇస్తున్నారు. వీలైనంత వరకు సేంద్రియ ఎరువుల వాడకానికి ప్రాధాన్యమివ్వాలని చెబుతున్నారు. దీని వల్ల భూసారం పెరగడంతో పాటు అధిక దిగుబడులు, ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తాయని అంటున్నారు. పెట్టుబడి వ్యయం కూడా తగ్గుతుందని సూచిస్తున్నారు. కొన్నిచోట్ల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన చర్యలతో రైతులు ప్రకృతి సేద్యానికి మక్కువ కనబరుస్తుండడం కొంతమేర మంచిదేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పిచికారీలో జాగ్రత్త వహించాలి..

మందుల పిచికారీలోనూ జాగ్రత్త వహించాలి. పంటలకు పురుగుమందు స్ప్రే చేసేటప్పుడు శరీరమంతా కప్పి ఉంచేలా దుస్తులను ధరించాలి. చేతులకు గ్లౌజ్‌లు వేసుకోవాలి. కళ్లకు రక్షణగా కళ్లజోడు వాడాలి. ముఖానికి మాస్క్, తలకు టోపీ ధరించాలి. అలాగే గాలి వీచే దిశకు ఎదురుగా పురుగుమందు స్ప్రే చేయకూడదు. అలాగే చేస్తే విషతుల్యమైన మందులు మన శరీరంపైనే పడి లేనిపోని రోగాలను తెచ్చిపెడతాయి. పిచికారీ తర్వాత బాగా స్నానం చేసి, రెండు, మూడు కాళ్లు, చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి.

> **మోతాదుకు మించి వాడితే మోసమే..**
>
> వ్యవసాయాధికారుల సూచనల మేరకే రైతులు పంటలకు పురుగుమందులు వాడాలి. పురుగుమందు తక్కువగా వాడితే పురుగులు చావవు..ఎక్కువగా వాడితే శత్రు పురుగులతో పాటు మిత్రపురుగులు కూడా నశిస్తాయి. ఏదైనా మోతాదుకు మించి వాడితే మోసపోవడం ఖాయం. రైతులంతా అప్రమత్తంగా ఉండాలి. జాగ్రత్తగా పంటలు పండించుకోవాలి.
>
> –కె.నీలిమ, వ్యవసాయాధికారిణి, పూసపాటిరేగ మండలం

చిల్డ్రన్ హోమ్ చిన్నారులతో డిప్యూటీ మేయర్ దీపావళి వేడుకలు


చిన్నారులతో కలిసి క్రాకర్స్ కాల్చుతున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని 40వ డివిజన్‌లో ఉన్న రెయిన్‌బో చిల్డ్రన్ హోమ్‌లోని చిన్నారులతో కలిసి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలగట్ల శ్రావణి ఆదివారం ముందస్తు దీపావళి పండగ జరుపుకున్నారు. చిన్నారులకు క్రాకర్స్ కొనిపెట్టి వారితో వాటిని కాల్చివేయించి వారిలో పండగ ఆనందం నింపారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఈ దీపావళి వెలుగులు మీ జీవితాల్లో మంచి కాంతులు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బోనెల ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ


మహిళలకు చీరలు అందజేస్తున్న సంఘ సభ్యులు

విజయనగరం టౌన్: మండలంలోని హుకుంపేట రామమందిరం వద్ద శ్రీపైడిమాంబ స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు చీరలు ఆదివారం పంపిణీ చేశారు. అమ్మవారికి మొక్కుగా భక్తులు చెల్లించిన చీరలను ఇలా పేదలకు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పరశురాం, అప్పారావు, పతివాడ వెంకటరావు, పిల్లా రామకృష్ణ, మజ్జి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత దీపావళి జరుపుకోవాలి


ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైమ్: ప్రజలంతా కాలుష్య రహిత దీపావళి జరుపుకోవాలని ఎస్పీ దామోదర్ సూచించారు. సోమవారం దీపావళి పండుగ పురస్కరించుకుని, జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఎస్పీ ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎటువంటి ప్రమాదానికి గురికాకుండా వెలుగుల పండగను చేసుకోవాలని, శబ్ద, వాయు కాలుష్యం జరగకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని తెలిపారు. మందుగుండు సామగ్రి కాల్చడంతో కార్బన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్ వంటి విష వాయువులు విడుదలై ఊపిరితిత్తులు, గుండె వంటి శరీరావయాలపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. ప్రతిఒక్కరూ బహిరంగ ప్రదేశాల్లోనే బాణాసంచా కాల్చాలని, చిన్నారులు పెద్దల పర్యవేక్షణలోనే క్రాకర్స్ పేల్చాలని తెలిపారు. టపాసులు కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు ధరించాలని, అందుబాటులో నీరు, ఇసుక కూడా ఉంచుకోవాలన్నారు. పెట్రోల్ బంక్‌లు, గ్యాస్ గొడౌన్‌లు, ఆస్పత్రులు, విద్యుత్ లైన్‌లు వాహనాలు వంటి వాటికి దూరంగా క్రాకర్స్ కాల్చాలన్నారు. ఎక్కడైనా అగ్నిప్రమాదం సంభవిస్తే ఫైర్ సర్వీస్ నంబర్ 101, పోలీస్ కంట్రోల్ రూమ్ 100, 112కి సమాచారం ఇవ్వాలన్నారు.

అన్నసమారాధన

విజయనగరం టౌన్: మాస శివరాత్రి పురస్కరించుకుని, స్థానిక కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్ద ఉన్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో అన్నసమారాధన ఆదివారం నిర్వహించారు. ప్రతి నెలా వచ్చే మాస శివరాత్రికి భక్తులకు స్వామి వారి అన్నప్రసాదం అందించడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్ రెడ్డి తెలిపారు. 2 వేల మందికి పైగా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారన్నారు. అంతకుముందు భక్తులంతా సుబ్రహ్మణ్య స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నగరవాసులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతరు..

- జనావాసాల మధ్య దీపావళి మందుగుండు సామగ్రి విక్రయాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం

నెల్లిమర్ల: దీపావళి పండుగ పురస్కరించుకుని, మండలంలో మందుగుండు సామగ్రి విక్రయాలు చేసుకునేందుకు నాలుగు దుకాణాలకు అధికారులు అనుమతులు జారీ చేశారు. అందులో రెండు షాపులు రూరల్ పరిధిలోనివి కాగా మరో రెండు నగరపంచాయతీలో పరిధిలోనివి. అయితే రూరల్ పరిధిలోని షాపులు ఇళ్లకు దూరంగా ఏర్పాటు చేసి, నిబంధనలు పాటిస్తున్నారు. నగర పంచాయతీ పరిధిలోని రెండు షాపులు మాత్రం ఆంధ్రా బ్యాంకు సమీపంలోని ఖాళీ స్థలంలో ఏర్పాటు చేశారు. అయితే అదే ఖాళీ స్థలం చుట్టుపక్కల పలు ఇళ్లు, ఆస్పత్రి, బ్యాంకు, హాస్టల్ ఉన్నాయి. అవి అక్కడ ఉన్నట్లు అధికారులకు తెలిసినా అక్కడే క్రాకర్స్ విక్రయాలకు అనుమతులు ఎలా ఇచ్చారోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ షాపుల్లో దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగే నివారణ చర్యలు కూడా శూన్యంగా కనిపిస్తున్నాయని కనీసం మంటలు ఆర్పేందుకు ఇసుక, నీరు కూడా ఎక్కడా కనిపించడం లేదని పలువురు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఆయా షాపులు నిర్వహిస్తున్న వారు అధికార పార్టీ నాయకులే కావడంతో అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయంలో ఎస్ఐ గణేష్‌ను సంప్రదించగా నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టెక్ ఫైర్ టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: స్థానిక పీఎస్ఆర్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన టెక్ ఫైర్ టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. పాఠశాల, జూనియర్ కళాశాల స్థాయి విద్యార్థుల్లోని సాంకేతిక ప్రతిభను ప్రోత్సహించేలా చేపట్టిన ఈ పరీక్షకు ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థల నుంచి 400 మంది హాజరై, తనలోని ప్రతిభను చాటారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులంతా సాంకేతిక నైపుణ్యం కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కరస్పాండెంట్ సన్యాసిరాజు తెలిపారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతుల విద్యార్థులకు సంబంధించినంత వరకు ఈ పోటీలో విజేతలుగా నిలిచిన వారికి వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే పాఠశాల వార్షికోత్సవంలో బహుమతులు అందజేస్తామన్నారు.

భోగాపురానికి మంత్రి కందుల దుర్గేష్

భోగాపురం: రాజాం పర్యటనలో భాగంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం భోగాపురం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే లోకం నాగమాధవి దుశ్శాలువాతో సత్కరించి, సాదరస్వాగతం పలికారు.

సన్మానం


మహ్మద్ అలీని సత్కరిస్తున్న దర్బార్ నిర్వాహకులు, తదితరులు

విజయనగరం టౌన్: రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సీఈవో ఎస్.మహ్మద్ అలీని నగరంలోని హుజుర్ హజరత్ ఖాదర్షావలీ దర్బార్‌లో ఆదివారం సన్మానించారు. ఆదివారం దర్బార్ సందర్శనకు విచ్చేసిన ఆయనకు దర్బార్ నిర్వాహకులు ఖలీల్‌బాబు, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యుడు సఫియా ఖాదర్ సాదరస్వాగతం పలికి పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించారు. నిరుపేద ముస్లింల అభ్యున్నతికి కృషి చేయడంలో రాష్ట్రంలోనే అత్యుత్తమ స్థానంలో ఉన్న బాబా దర్బార్‌ను సందర్శించడం ఆనందంగా ఉందని మహ్మద్ అలీ అన్నారు.

దీపావళి సందడి


మందుగుండు సామగ్రి కొనుగోలుదారులతో కిక్కిరిసిన కేఎల్‌పురం


దీపావళి క్రాకర్స్ కొనుగోళ్లతో ఏర్పడిన ట్రాఫిక్ జామ్

విజయనగరంలో దీపావళి పండుగ సందడి నెలకొంది. సోమవారం వెలుగుల పండుగను ఘనంగా నిర్వహించుకునేందుకు ప్రజలు ఉవ్విళ్లూరుతున్నారు. ఆదివారం నగరంలో పలుచోట్ల ఏర్పాటైన క్రాకర్స్ షాపుల వద్దకు పెద్దఎత్తున జనం చేరుకుని, గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చొని బాణసంచా కొనుగోలు చేశారు. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ ఎంతో ఇష్టంగా జరుపుకునే ఈ వేడుకను అత్యంత వైభవంగా జరుపుకునేందుకు ఉత్సాహం కనరుబస్తున్నారు. మందుగుండు సామగ్రి కొనుగోళ్లకు వచ్చిన జనంతో పలు ప్రాంతాలు రద్దీగా కనిపించగా, కొన్నిచోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం




బాణసంచా కొనుగోళ్లకు షాపుల వద్ద బారులుతీరిన ప్రజలు


క్రాకర్స్ షాపు వద్ద భారీగా నిలిచిన వర్షపునీరు